

# అపవాదు

రోషన్

మేముంటున్నది ఓ మోస్తరు యిల్లు. మా నల్గురు బ్రహ్మచారులకు విశాలంగానే ఉంటుంది. నల్గురమూ కలిసిమెలిసి వుంటాము. ఎటొచ్చీ చిక్కంతా మా రావుగాడిదే. వాడికి మహమ్మద్ రఫీ పాటలంటే బలే యిష్టం. ఒక్కోసారి వాడు పాడే ఆ ప్రేమ గీతాలు వింటే బాగానే పాడతాడు అన బుద్దేస్తుంది. ఎటొచ్చీ చిరాకంతా మధ్యాహ్నం పూట వాడు చేసే ప్రాక్టీసే. అక్కడ వాడి పాట శృతిమించి రాగాన పడుతుంటే యిక్కడ మా కోపంకూడ తారస్థాయి నందుకునేది. కాని వాడితో ఎంత వాదులాడినా వాడు వాడి ప్రాక్టీసు మాత్రం విడిచేవాడు కాదు. ఒక్కోసారి వాడి పీక నులిమి పారేద్దామా అన్నంత కోపంకూడా వచ్చేది. అలా చెప్పాముకూడ. అయినా సరే వాడి ప్రాక్టీసుకు ఏ మాత్రమూ అవరోధం కలగలేదు.

ఆ ఒక విషయంలో ఆ మొండి పట్టుదల తప్ప మిగతా విషయాల్లో వాడంత మంచి మనిషి మరింకోడు లేడనుకోవచ్చు. ఒక్కోసారి భోజన సమయంలో వున్నట్టుండి పాట ఎత్తుకునేవాడు. కోపం గొంతుదాకా వచ్చినా, కోపగించుకుంటే లాభం లేదనుకొని 'ఒరేయ్! రావుడూ! బుజ్జీ? పరుగెట్టి పాలుతాగే కంటే నిలబడి నీళ్ళు త్రాగటం మేలురా.' అంటే యిప్పుడేం అన్నట్లు కళ్ళతోనే సైగ చేసేవాడు పాట ఏమాత్రం ఆపకుండా.

'ఏంలేదు నాయనా! భోజనం చేసేటప్పుడు కాస్త అలా గొంతుచించుకోడం మానేసి స్థిమితంగా కూర్చొని తిను. అంతలోనూ యిది బ్రహ్మచారుల వంటాయె.' అంటే ఒక్క వుదుటున ఎగిరి 'అందుకేరా చెప్తున్నాను. ముందు తియటి నా పాట వినండి. ఆ తర్వాతే కషాయంలావున్న ఈ అన్నం మింగేద్దాం, ఆ తియ్యదనంతోపాటు' అనేవాడు. అనడమే తడవు ఏ విషాదగీతమో ఏ శృంగార గీతమో పాడేసేవాడు. చచ్చినట్టు వినాల్సిందే మరి. ఏదో వొరోజు వాడూ ఆ మహాగాయకుడు రఫీలా అయిపోతావని వాడి నమ్మకం. వాడి నమ్మకం సడలించాలని లేదు కాని కాస్త మధ్యాహ్నం పూట ఆ పడుకునే సమయంలో ప్రశాంతంగా వుండాలని మా కోరిక అంతే. అక్కడికీ చెప్పాము 'ఆ టైములో పాడకురా తండ్రీ' అని. వింటేనా మరి? వహా! యిక మాకు ఆ ప్రశాంతత అనేది వాడి సాంగత్యంలో మాత్రం దొరకదు. వాడికి దూరంగా వుండాలంటే ఆ యింటినుండి బస మార్చెయ్యాలి. అయ్య బాబోయ్! బసమార్చటం ఎలా? అంత తక్కువ ఖరీదుకు మరి అల్లాంటి యిల్లు అన్ని సౌకర్యాలతో ఎక్కడ లభిస్తుంది.

## అపవాదు

అందుకోనేం. ఆ బాధ పడ్తూనే అలాగే గడిపేస్తున్నాము. ఏ నాడైనా కనికరించక పోతాడా మా బాధ చూసి అని. వుహు! మా ఆశ అడియాసే అయ్యింది.

'ఉహు లేదురోయ్ మీరు చాల అదృష్టవంతులన్నట్లు' వో రోజు మధ్యాహ్నం హఠాత్తుగా పాట ఆగిపోయింది. ఆ రోజు మధ్యాహ్నం హాయిగా కంటినిండా కునుకు తీశాము. సాయంత్రం లేస్తూనే వాడిని అభినందించి పారేశాము. వాడికి పార్టీ యిచ్చాము. ఇంతచేసినా వాడు వులకలేదు పలకలేదు. తనకేమీ పట్టనట్లు వూరుకున్నాడు. 'పాపం! దిగులేమో' అనుకున్నాము. కాని వో నాల్గు రోజులయ్యాక

వాడి పరిస్థితి మరీ-త అధ్వాన్నంగా మారిపోయింది. అన్నపానీయాలు మానేశాడు. తనలో తనే గొణుక్కునేవాడు. మాకేమీ పాలుపోక, వాడి పరిస్థితి చూళ్ళేక 'ఓరేయ్! మాకేం యిబ్బంది లేదు గని హాయిగా ప్రాక్టీసు చేసుకోరా' అన్నాము.

వాడు మావైపు చూసి, విషాదంగా నవ్వి 'ఉహు. మరి నాకంత అదృష్టం లేదురా. అంతా అయిపోయింది' అనేసి వెళ్ళిపోయాడు దేవదాసులా.

మాకేమీ తెలీలేదు. 'ఎవర్నన్నా ప్రేమించిందేమో!' అనుమానం వేసింది; ఛీ! పిచ్చి సన్యాసి. పాడుకోవడం తప్ప యింకోటి చెయ్యలేడు. మరింకేమిటీ ?'

చివరికి వాణ్ణి గోదారికి తీసికొన్నాం; ఎలాగైనా వాడి బాధకు కారణమేమిటో తెల్సుకోవాలని.

'చెప్పలేనురా' విషాదంగా అన్నాడు.

'ఫర్వాలేదు చెప్పు' బలవంతం చేశాము.

'ఊ...అపవాదువచ్చిందిరా. అందుకే మానేశాను' విరక్తిగా అన్నాడుబాటసారిలా.

ఆశ్చర్యపోయాము.

'నీకు...నీకు అపవాదేమిట్రా? ఎలా వచ్చింది? అసలు కారణమేమిటి?' ఒక్కుమ్మడిగా అడిగాము.

తలవంచుకున్నాడు మా రావు. కళ్ళల్లో నీళ్ళు కూడ చిందాయి.

'మరేం లేదురా! ఆ రోజు పక్కింటి గుర్నాథంగారు పిలిచి, నేను వాళ్ళ వుషారాణి కోసమే ప్రేమగీతాలు పాడుతున్నానని, యిల్లా చేసే పంటే యింటి యజమానితో చెప్పి, ఖాళీ చేయిస్తానని చెప్పేడు.' అన్నాడు.

మా అందరికీ కోపం వచ్చేసింది. అసలు అమ్మాయిల వేపే కన్నెత్తి చూడని రావుకా యిల్లాంటి అపవాదు? సహించలేక పోయాము. అప్పటికప్పుడే వెళ్ళి నిలదీసి అడిగాము. 'మీ వుద్దేశ్యం ఏమిటి?' అని.

ఆయన చెప్పిన జవాబు విని అసలు మూర్ఛపోయాము.

'మరేం లేదు బాబులూ! మీరు మీ రావుడిగారితో ఎలా బాధ పడ్తున్నారో చూసి జాలేసింది. ఎలాగైనా రావుడిగారి పాట మాన్పించాలని పిలిచి చీవాట్లేశాను. కాని మా వుషారాణికి రావుడిగారి పాటలంటే చాల యిష్టం. అందుకోసం వారి పాటలన్నీ మా వుషారాణికే ధారాదత్తం చేస్తారేమో కాస్త అడిగి తెలుసుకోండి నాయనా కట్న కానుకల్లో ఏం తీసిపోము. అన్నీ సవ్యంగా కుదిరితే త్వరలో ముహూర్తాలు పెట్టించుకోవచ్చు. ఏమంటారు?'

ఇంకేమంటాము?!...

'వాడి పొట్టి విరిగి నేతిలో పడ్డది.' అందామా?

అలాగే అనుకున్నాం. ●


భరింపరాని ఒళ్లునొప్పి
నిమిషాలలో పోయింది!



అమృతాంజనం

ప్రభావమిల్లమే

